ఫెంగల్.. అన్నదాత హడల్

- వరిపంట ఒబ్బిడి వేళ వర్షం
- హడావుడిగా నూర్పిడులు, ధాన్యం లోడింగ్
- కొవ్వూరు డివిజన్‌లో 34,625 హెక్టార్లలో వరిసాగు


పెరవలిలో వరికోత మెషీన్‌తో పంట కోత

పెరవలి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో శుక్రవారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. అన్నదాతలకు ముచ్చెమటలు పడుతున్నాయి. శుక్రవారం ఆకాశం మేఘావృతమై చినుకులు పడటంతో రైతులు హడావిడిగా పంటలు ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. శనివారం ఉదయం నుంచి వర్షపు తీవ్రత పెరిగింది. ప్రస్తుతం వరి పంట రాశుల్లో నిల్వ ఉంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగితే చేతికందిన పంట నోటికి దక్కకుండా పోతుందని రైతులు కలవరపడుతున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో దాదాపు రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పొలాల్లో రాశులుగా ఉందని అధికారుల అంచనా. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఖరీఫ్‌లో 34,625 హెక్టార్లలో వరి సాగు చేశారు. నిడదవోలు నియోజకవర్గంలోనే 36,500 ఎకరాల్లో వరి సాగైంది. ఇప్పటివరకూ డివిజన్ పరిధిలో 25 వేల హెక్టార్లలో మూసూళ్లు పూర్తయ్యాయి.

వరికోతలు ఎంత వరకూ..

నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటికే 60 శాతం వరికోతలు పూర్తయ్యాయి. పెరవలి మండలంలో 3,800 ఎకరాల్లో కోతలు పూర్తవగా, అందులో 2,250 ఎకరాల్లోని పంట అమ్మకాలు కూడా జరిగాయి. మిగిలిన 1,550 ఎకరాల్లోని పంట ధాన్యం రాశుల్లోను, బస్తాల దశలోనూ ఉంది. శుక్రవారం ఒక్కరోజే పెరవలి మండలంలో 1,050 ఎకరాల్లో వరికోతలు నిర్వహించారు. ఒకవైపు చినుకులు పడుతున్నా రైతులు ధైర్యం చేసి కోతలు సాగించారు. ముందస్తుగా వరినాట్లు వేసిన ఉసులుమర్రు గ్రామంలో ఇప్పటికే 90 శాతం కోతలు పూర్తవడంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోగలిగారు. తీపర్రు, కానూరు, పెరవలి, అజ్జరం, పిట్టల వేమవరం, ఖండవల్లి, కాపవరం, ముక్కామల, అన్నవరప్పాడు గ్రామాల్లో 1,050 ఎకరాల్లో కోతలు జరిగి పంట ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమై ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత చినుకులు పడినప్పటికీ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పంటకు నష్టం జరగలేదు. కొందరు రైతులు మెషీన్లతో కోసిన ధాన్యం తేమగా ఉన్నప్పటికీ హడావుడిగా రోడ్లపైకి తెచ్చి బస్తాల్లోకి పట్టారు. ఖర్చుకు వెనుకాడకుండా కూలీలను పెట్టి ధాన్యాన్ని పొలంలో నుంచి బయటకు తెచ్చుకోగలిగారు.


నల్లాకులవారిపాలెంలో ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కూలీలు

రాశుల్లో ఎంత ధాన్యం నిల్వ ఉంది

నిడదవోలు నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రానికి రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద బస్తాల్లో, రాశుల్లో నిల్వ ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి వర్షం కురవడంతో రాశులు ఎత్తలేక, బస్తాల్లో పట్టిన ధాన్యం ఎగుమతి చేయలేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. శనివారం మధ్యాహ్నం వర్షం తెరిపివ్వడంతో బస్తాల్లో పట్టిన ధాన్యాన్ని రైతులు హడావుడిగా ట్రాక్టర్లకు లోడ్ చేసి మిల్లులకు తరలించారు. తుపాను ప్రభావంతో వాతావరణం ప్రతికూలంగా మారడంతో వ్యవసాయ కూలీలు కూలి రేటు పెంచేశారు. సాధారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ పని చేసే పురుష కూలీలకు రోజుకు రూ.600 నుంచి రూ.800 చొప్పున కూలి ఇస్తారు. ఇప్పుడు మండలంలోని కూలీలు రోజుకు రూ.1000 డిమాండ్ చేస్తున్నారు.

లైటింగ్ ఏర్పాటు చేసి వరి కోత



తుపాను వల్ల పంట చేతికి దక్కకుండా పోతుందనే భయంతో శుక్రవారం లైట్లు పెట్టి వరికోతలు పూర్తి చేశాం. ఒక్కో కూలీకి రూ.1000 ఇచ్చి పొలంలోని ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చి రాశి చేశాం. వర్షం ఏం చేస్తుందో అని భయపడుతున్నాం.

– దిడ్ల సంపతిరావు, రైతు, ఖండవల్లి

పంట చేతికొస్తుందో.. లేదో..



ఈ ఏడాది పంట అంతంత మాత్రంగా పండింది. తుపాను వల్ల ఆ కొద్దిపాటి పంట కూడా చేతికొస్తుందే లేదో తెలియని పరిస్థితి. ఒకవైపు చినుకులు పడుతున్నా ధాన్యాన్ని ఒబ్బిడి చేశాం. భారీ వర్షం వస్తే మాత్రం ధాన్యం తడిసిపోతుంది. ఏమవుతుందోనని ఆందోళనగా ఉంది.

– నందమూరి నారాయణరావు, రైతు, తీపర్రు

ఈదురు గాలులు.. వర్షపు జల్లులు

దేవరపల్లి: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో కొవ్వూరు డివిజన్‌లోని పలు గ్రామాల్లో శనివారం నుంచి ఈదురుగాలులు, వర్షపు జల్లులు పడుతున్నాయి. ప్రధానంగా వరి, పొగాకు, అరటి పంటలు వేసిన రైతులు కలవర పడుతున్నారు. కోసిన ధాన్యం రోడ్లపై ఆర బెట్టి రాశులు పోశారు. పొగాకు తోటలకు ఎరువులు వేసి పైపాట్లు చేస్తున్నారు. నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు మండలాల రైతులు కోసిన ధాన్యాన్ని రోడ్లపై రాశులు పోసి మిల్లులకు తరలించడానికి సిద్ధం చేశారు. వర్షాలకు ధాన్యం రాశులపై బరకాలు కప్పి ఒబ్బిడి చేస్తున్నారు. అయితే వర్షపు జల్లులు, చలిగాలులకు ఆరిన ధాన్యం తేమశాతం ఎక్కువ అవుతుందని, దీని వల్ల మద్దతు ధర కోల్పోతామని రైతులు అంటున్నారు. దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో సుమారు 150 ఎకరాల్లో కోసిన ధాన్యం రోడ్లపై ఉందని రైతులు తెలిపారు. రెండురోజులు ఉంటే ధాన్యం మిల్లులకు వెళ్లేదని తెలిపారు. గౌరీపట్నం, దుద్దుకూరు గ్రామాల ధాన్యాన్ని హైవే సర్వీసు రోడ్డుపై ఆరబెట్టారు. ఈ జల్లుకు ధాన్యం నాణ్యత, దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. దాదాపు 80 శాతం ధాన్యం అమ్మకాలు పూర్తయ్యాయని, 20 శాతం ధాన్యం కోతదశలో ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కోతకు వచ్చిన పంటను తుపాను ప్రభావం తగ్గే వరకూ కోయవద్దని, రోడ్లపై గల ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త తీసుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈ వాతావరణం పొగాకు పంటకు నష్టం ఉండదని, వర్షాలు అధికంగా కురిస్తే వేసిన తోటలు దెబ్బతింటాయని బోర్డు అధికారులు అంటున్నారు. ప్రధానంగా పొగాకు తోటల్లో నీరు నిల్వ లేకుండా మురుగు నీటి బోదెలు ఏర్పాటు చేసుకోవాలని బోర్డు రీజినల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ రైతులకు సూచించారు. పల్లపు భూములు, బాడవ పొలాల్లో పొగాకు నాట్లు వేయవద్దని రైతులకు సూచించారు. ఈదురు గాలుల తీవ్రత ఎక్కువైతే అరటి తోటలు పడిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.


దేవరపల్లిలో సాగులో ఉన్న పొగాకు తోట (ఫైల్)

క్లుప్తంగా

ఇంజక్షన్ వికటించి యువతి మృతి


ఆశకీర్తి మృతదేహం

నల్లజర్ల: ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ) చేసిన వైద్యం వికటించి ఓ యువతి మృతి చెందింది. మండలంలోని పోతవరం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామంలోని కొత్తపేటకు చెందిన గంధిపాం వెంకటేశ్వరరావు కుమార్తె ఆశ కీర్తి (23) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆమె గ్రామంలోని పీఎంపీ దాసోజు రామబ్రహ్మం ఇంటికి వెళ్లి వైద్యం చేయించుకుంటోంది. శనివారం సాయంత్రం ఆశ కీర్తి తన కాళ్లు, చేతులూ లాగుతున్నాయంటూ వైద్యం కోసం పీఎంపీ ఇంటికి వెళ్లింది. టైఫాయిడ్ లక్షణాలు కనపడుతున్నాయని, బ్లడ్ టెస్ట్ చేయించుకోవాలంటూ పీఎంపీ బ్రహ్మం ఆమెకు సూచించారు. బ్లడ్ టెస్ట్ చేయించుకొని వెళ్లిన ఆమెకు రామబ్రహ్మం ఒక ఇంజక్షన్ చేశారు. అది రియాక్షన్ ఇవ్వడంతో దానికి విరుగుడుగా మరో ఇంజక్షన్ చేశారు. వెంటనే ఆమె వాంతులు చేసుకొని మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ విషయం తెలియగానే కొందరు గ్రామపెద్దలు రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. రాత్రి 10.30 వరకూ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. కాగా ఆశ కీర్తి అవివాహిత.

ఘనంగా బరింకలమ్మ ఆలయ వార్షికోత్సవం

నిడదవోలు రూరల్: పురుషోత్తపల్లి గ్రామదేవత బరింకలమ్మ వారి ఆలయ రెండో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బరింకలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రసవాలు పీహెచ్‌సీల్లోనే..


తాడిమళ్ల పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

నిడదవోలు రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే సుఖ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని తాడిమళ్ల పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ తప్పనిసరిగా చేయాలని, ఎన్‌సీడీ-సీడీ 3.0 సర్వే చేయాలని, స్కూల్ హెల్త్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సేవాభావంతో పని చేయాలన్నారు. ఆసుపత్రుల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షమ్మీకుమార్, డాక్టర్ హరి, పీహెచ్‌సీ వైద్యాధికారి ఆండ్రూ, డాక్టర్ ఆశాలత, సిబ్బంది పాల్గొన్నారు.

గోష్పాదేశ్వరునికి లక్ష రుద్రాక్ష పూజ

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శనివారం హిందూ కార్తిక వన సమారాధన నిర్వహించారు. తొలుత వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ చేశారు. శివస్వామీజీ పర్యవేక్షణలో గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్ష పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో మేళతాళాలతో శోభాయాత్ర నిర్వహించారు. గోపూజ, విష్ణుసహస్ర పారాయణ, లక్ష్మీనారాయణ పూజ, సాయంత్రం కోనేరులో దీపోత్సవం, 120 మంది పండితులకు సత్కారం జరిగాయి. పట్టణానికి చెందిన గండ్రోతు పవన్ సోమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ వన సమారాధనకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూజల్లో పాల్గొన్నారు. గుళ్లపల్లి సీతారామ లక్ష్మీనారాయణ శర్మ ఘనపాఠి పర్యవేక్షణలో రుత్వికులు పూజలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని దంపతులు, టీఎస్‌వీ రమణమూర్తి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. చిలంకుర్తి వెంకటసుబ్బారావు (బాబి), గోసంరక్షణ సౌత్ ఇండియా చైర్మన్ చిట్టా శివ గణేశ్ శర్మ, వైకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

గోపాలపురం: మండలంలోని చెరుకుమిల్లిలో నిర్వహిస్తున్న కోడి పందేలపై గోపాలపురం పోలీసులు దాడి చేశారు. పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,600 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. నిందితులు నలుగురినీ కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

యువతి అదృశ్యం

నల్లజర్ల: మండలంలోని దూబచర్లకు చెందిన ఈడే వెంకటలక్ష్మి (18) శుక్రవారం రాత్రి నుంచి అదృశ్యమైంది. కొంతకాలంగా వెంకటలక్ష్మి తెలికిచెర్లలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఈ మేరకు ఆమె తల్లి నాగరత్నం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్‌ఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుష్కరాల పనులకు రూ.120 కోట్లతో ప్రతిపాదనలు

- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ
- నిడదవోలు మున్సిపల్ సమావేశం


కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు

నిడదవోలు: రానున్న గోదావరి పుష్కరాల్లో నిడదవోలు పట్టణంలో ఏర్పాట్ల కోసం వివిధ శాఖలకు రూ.120 కోట్లు ఖర్చయ్యే పనులకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రకటించారు. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్మన్ ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ ఆలమూరి భారతి మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. గణపతి సెంటర్ నుంచి సంత మార్కెట్ వరకూ రోడ్డు గతుకులమయంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కనీసం మరమ్మతులైన చేపట్టాలని ఆమె కోరారు. దీనికి మున్సిపల్ ఏఈ హేమంత్ కుమార్ స్పందిస్తూ పట్టణంలోని గూడెం రైల్వే గేట్ వద్ద జరుగుతున్న ఆర్వోబీ నిర్మాణ పనుల వల్ల కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. దుమ్ము లేవకుండా రోడ్లను రోజుకు మూడుసార్లు తడపాలని ఆర్ అండ్ బీ శాఖకు సూచించామన్నారు. రెండురోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సమాధానం చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కె.కృష్ణవేణి, డీఈ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రియ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

నిడదవోలు రూరల్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఎంఈఓ కేవీ గణేశ్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.వెంకట సత్య పద్మావతి ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కె.జిలానీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ గణేశ్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన పద్మావతి సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పద్మావతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివాకర్, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


ఎస్‌కె బేగం మృతదేహం

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం గ్రామ శివార్లలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా రెడ్డి గణపవరానికి చెందిన ఎస్‌కె బేగం (40) అనే మహిళ మృతి చెందింది. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెడ్డిగణపవరం నుంచి వామిశెట్టి వెంకటేశ్వరరావు, ఎస్‌కె బేగం అనే వారు మోటార్ సైకిల్‌పై వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయలు దేరారు. జగన్నాథపురం గ్రామ శివార్లలోకి వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన ఇరువురినీ తొలుత గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో ఎస్‌కె బేగం మృతి చెందింది. వెంకటేశ్వరరావు కాలికి బలమైన గాయమైనట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చాగల్లు: నిడదవోలు- పంగిడి మార్గంలో బ్రాహ్మణగూడెం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని ఊనగట్లకు చెందిన తొర్లపాటి అచ్చిబాబు, కొండయ్య అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఊనగట్లకు చెందిన వారిద్దరూ నిడదవోలు మార్కెట్‌కు వెళ్లి బైక్‌పై స్వగ్రామం తిరిగి వస్తున్నారు. బ్రాహ్మణగూడెం కనకదుర్గమ్మ గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొట్టడంతో ఇద్దరికీ బలమైన గాయాలయ్యాయి. తలకు,ముఖానికి తీవ్ర గాయాలైన అచ్చిబాబు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తొర్లపాటి కొండయ్యకు కూడా బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఇద్దరినీ తొలుత ఆటోలో నిడదవోలు ఆస్పత్రికి తరలించారు.అచ్చిబాబు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి మార్చారు.కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చాగల్లు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు.

కొవ్వూరు యువతికి అవార్డు


అవార్డు అందుకుంటున్న చావా హిమబిందు

కొవ్వూరు: న్యూఢిల్లీలో నిర్వహించిన స్కాచ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఏపీ రాష్ట్ర వాణిజ్య పన్నుల విభాగానికి స్వర్ణ,రజత పతకాలు దక్కాయి.రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ డెవలప్ చేసిన రిటర్న్ స్క్రూటీనీ ఆటోమేషన్ టూల్, జీఎస్‌టీ మిత్ర అనే రెండు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌కు ఈ పురస్కారాలు లభించాయి. కొవ్వూరుకు చెందిన చావా హిమబిందు ప్రస్తుతం విజయవాడలోని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తోంది. ఈమెతో పాటు డిప్యూటీ కమిషనర్ ముళ్లపూడి జయకృష్ణ ఈ అవార్డులు అందుకున్నారు.

కెంపురత్నం సేవలు ప్రశంసనీయం


ఎంఈఓ కెంపురత్నంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొవ్వూరు: మండల విద్యాశాఖాధికారిగా సుదీర్ఘ కాలం పని చేసిన జె.కెంపురత్నం అందించిన సేవలు ప్రశంసనీయమని డీఈఓ కె.వాసుదేవరావు కొనియాడారు. కెంపురత్నం శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో డీఈఓ మాట్లాడారు. ఎంపీడీవో కె.సుశీల, చాగల్లు, తాళ్లపూడి, దేవరపల్లి ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఎస్‌కే సలీం, పి.రమేష్‌బాబు, పి.జయరాజు, నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు, బంధువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో కెంపురత్నాన్ని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

వీధిలైట్ల నిర్వహణ దారుణం

- నిర్వహణ బాధ్యత ఏజెన్సీకి అప్పగించాలి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల సూచన


సమావేశానికి హాజరైన సభ్యులు. కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి (అంతర చిత్రం)

కొవ్వూరు: పట్టణంలో వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, ఏ వార్డులోనూ సక్రమంగా వెలగడం లేదని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్ల నిర్వహణ బాధ్యతను టెండర్లు పిలిచి ఏదైనా ఏజెన్సీకి అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఏ వీధిలో ఎన్ని లైట్లు వెలగడం లేదో వంటి కనీస సమాచారం కూడా మునిసిపల్ సిబ్బంది వద్ద లేదని మురళీకృష్ణ ఆరోపించారు. మరమ్మతులు చేసిన ఒకటి,రెండు రోజుల్లోనే వీధిలైట్లు వెలగక పోవడంతో తాము ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తోందన్నారు. అలాగే పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందన్నారు. ఇటీవల ఓ న్యాయవాదిని కుక్క కరిచి గాయపరిచిందని ఆయన సమావేశం దృష్టికి తెచ్చారు. ఆ గాయం మానకపోవడంతో మానసిక ఆందోళనతో గుండెపోటు వచ్చి మృతి చెందారన్నారు. గోష్పాదక్షేత్రం వద్ద ఏటిగట్టుపై రుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పార్కుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో, ఆ పార్కులలోని విలువైన బొమ్మలు పాడవుతున్నాయన్నారు. పార్కులకు కాపలాదారును ఏర్పాటు చేయించాలని కోరారు. వీధిలైట్ల నిర్వహణ బాధ్యతను గతంలో మాదిరిగా నిర్వహణ ఏజెన్సీకి అప్పగిస్తామని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోష్పాదక్షేత్రంలో శుభ్రతకు ఆలయాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. పట్టణంలో నీటిపన్ను బకాయిలు రూ.1.20 కోట్లు ఉన్నాయని కమిషనర్ చెప్పారు. వసూలు సమయంలో మునిసిపల్ సిబ్బందికి కౌన్సిల్ సభ్యులు సహకరించాలని కోరారు. గోష్పాద క్షేత్రానికి వచ్చే టూరిస్టు బస్సుల నుంచి కొంత రుసుము చొప్పున వసూలు చేస్తే పారిశుధ్య నిర్వహణకు ఉపకరిస్తాయని కౌన్సిల్ సభ్యులు రుత్తల భాస్కరరావు, మురళీకృష్ణ సూచించారు. మునిసిపల్ ఆదాయం పెంపునకు తాడిపత్రి మునిసిపాలిటీ అనుసరిస్తున్న విధానాల పరిశీలనకు కౌన్సిలర్లతో టూర్ ప్లాన్ చేయాలని చైర్‌పర్సన్ రత్నకుమారి, ఇతర సభ్యులు కోరారు. గణేశ్ ఉత్సవాల నిమజ్జనం సందర్భంగా ఇటీవల గోష్పాద క్షేత్రంలో చేసిన ఏర్పాట్లకు అయిన ఖర్చుల చెల్లింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అక్టోబర్ నెల ఆదాయ,వ్యయాల వివరాలను కౌన్సిల్‌కు నివేదించారు. వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- కాలువ గట్టు వద్దే చెక్‌పోస్టు ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

నల్లజర్ల: పోలవరం కాలువ గట్టును కొల్లగొట్టి, సొమ్ము చేసుకుంటున్న కూటమి పార్టీల నేతల ఆట కట్టించేందుకు ఎట్టకేలకు అధికారులు రంగంలోకి దిగారు. 'పట్టపగలే కాలువ గట్లు కొల్లగొట్టేస్తున్నారు' అనే శీర్షికన ఈ నెల 22న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆలస్యంగానైనా అధికారులు స్పందించారు. రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే నాయకులు జేసీబీలు, టిప్పర్లు కొనుగోలు చేశారు. తొలుత రాత్రి వేళల్లో మాత్రమే పోలవరం కాలువ గట్టును అక్రమంగా తవ్వి, ఆ మట్టిని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విక్రయించేవారు. దీనిపై పలు దఫాలుగా వార్తలు వచ్చినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. ఇటీవల అక్రమార్కులు పట్టపగలే మట్టి రవాణా మొదలుపెట్టారు. పది టిప్పర్లు నిరంతరం మట్టిని తరలిస్తూనే ఉన్నాయి. సింగరాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరరావు ఈ టిప్పర్లను అడ్డగించారు. అంతేగాకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టీడీపీ, జనసేన నేతల టిప్పర్లు, జేసీబీలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టరు ప్రశాంతి సీరియస్ అయ్యారు. మట్టితరలింపు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం మండలంలోని మార్రెళ్లమూడి, సింగరాజుపాలెం, ఆవపాడు సరిహద్దులో పోలవరం కాలువ గట్టు వద్దే చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టులో 24గంటలూ పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బంది కాపలా ఉంటారు. ఏపార్టీ వారైనా, ఎంత పెద్దమనుషులైనా నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నల్లజర్ల తహసీల్దార్ కృష్ణారావు వెల్లడించారు. త్వరలోనే ఇసుక అక్రమ రవాణాపై కూడా చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ అయ్యప్పరాజు ఉన్నారు.


ఆవపాడు, మార్రెళ్లమూడి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీస్ చెక్‌పోస్ట్

ఆరబెట్టిన ధాన్యం మిల్లులకు తరలించండి

పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాధిక


రోడ్డుపై ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాధిక

పెరవలి: తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రోడ్లపైన, రాశులుగా ఉన్న ధాన్యం తడిసిపోకుండా వెంటనే మిల్లులకు తరలించాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.రాధిక అధికారులకు సూచించారు. మండలంలోని ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, నడుపల్లికోట, ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను గ్రామాల్లో రోడ్లపై ఉన్న ఖరీఫ్ ధాన్యాన్ని శనివారం సాయంత్రం ఆమె పరిశీలించి, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 202 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 19,916 మంది రైతుల వద్ద నుంచి 1,57,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందు నిమిత్తం రైతులకు చెల్లించాల్సిన రూ.363 కోట్లలో, ఇప్పటికే రూ.301 కోట్లు నేరుగా వారి ఖాతాలకు జమ చేశామన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కోతలు పూర్తి అయి బహిరంగంగా ఉంచిన, రహదారులపై ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని రైతులను ఆమె కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 83094 87151కు గాని, టోల్ ఫ్రీ నంబర్ 1967 కు గాని ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.అచ్యుత కుమారి, ఉండ్రాజవరం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, సివిల్ సప్లయ్ అధికారులు, ఏఈఓ మాచరమ్మ, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: పేద విద్యార్థి ఇంజినీరింగ్‌కు చదువుకు మానవత సంస్థ అండగా నిలిచింది. దూబచర్లకు చెందిన బోడిగడ్ల అజేయచంద్ర విజయనగరంలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న అతడి ఇంటికి మానవత సంస్థ మండల శాఖ ప్రతినిధులు శనివారం వెళ్లి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే చీపురుగూడేనికి చెందిన తోట సత్యవతికి ప్రమాదంలో రెండు చేతులూ విరిగిపోయాయి. వైద్య ఖర్చుల నిమిత్తం ఆమెకు రూ.5 వేలు సాయంగా అందజేశారు. మానవత సంస్థ ప్రతినిధులు వెంకటసుబ్బారావు, ఝూన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడండి

నిడదవోలు: ఈ నెల14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి పి.రామకృష్ణ సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణపై కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్ల వారీగా అపరిష్కృతంగా ఉండి, రాజీ కాదగిన కేసుల వివరాలను ఆయన పోలీసులను అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని కేసులు పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పని చేయాలన్నారు.